ఓపెన్ థియేటర్‌కు మహర్దశ

- సాంస్కృతిక వేదికగా నిలిచేలా ఏయూ సన్నాహాలు
- 26న వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం రోజున ప్రారంభోత్సవం
- దాతలు ఇచ్చిన రూ.50 లక్షలతో కుర్చీలు, మౌలిక వసతుల కల్పన



పూర్తయిన ఫ్లోరింగ్ నిర్మాణం



కొనసాగుతున్న ఆడిటోరియం పనులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి తలమానికంగా నిలిచే ఆరుబయలు రంగస్థలం(ఓపెన్ ఎయిర్ థియేటర్)కు మహర్దశ వచ్చింది. దాతల సహకారంతో సకల వసతులతో రూపుదిద్దుకుంటోంది. ఈ నెల 26న ఆంధ్ర విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం రోజున ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. రూసా నిధులతో తొలిదశలో గతంలో వేదిక, ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేసిన ఏయూ పాలకులు తాజాగా దాతల సహకారంతో దాదాపు రూ.50 లక్షలు ఖర్చుచేసి సీటింగ్, ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయి.

చారిత్రక ప్రాధాన్యం .. నాటక కళకు వేదికగా నిలిచిన ఏయూ కె.వి.గోపాలస్వామి ఓపెన్ ఎయిర్ థియేటర్‌కు ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. నాటకరంగ అభిలాష కలిగిన పూర్వ రిజిస్ట్రార్ కె.వి.గోపాలస్వామి ఆలోచన మేరకు 1957లో దీనిని నిర్మించారు. ఇక్కడ ప్రదర్శించే నాటకాలను తిలకించడానికి ఎన్‌టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు వచ్చేవారు. అటువంటి రంగస్థలం కాల గమనంలో గత పాలకుల చర్యల ఫలితంగా కొంత నిరాదరణకు గురైంది. చాట్ల శ్రీరాములు, అబ్బూరి గోపాలకృష్ణ, సాక్షి రంగారావు, వంకాయల సత్యనారాయణ, మిస్రో వంటి నాటక, సినీ రంగ ప్రముఖులు ఈ వేదికను ఆధారంగా చేసుకుని ఎదిగారు. హుద్‌హుద్ కాలంలో దెబ్బతిన్న దీనిని ఇటీవల రూ.70 లక్షలు వెచ్చించి పునర్నిర్మించారు. వేదికను 24 అడుగుల ఎత్తులో రెండంతస్తుల బ్యాక్ స్టేజీతో సిద్ధం చేశారు. కళాకారులకు ఉపయుక్తంగా వేదికకు ఇరువైపులా గ్రీన్ రూమ్‌లు నిర్మించారు. రంగస్థలంపై వివిధ ప్రకృతిసిద్ధ సన్నివేశాలను ప్రదర్శించడానికి సైక్లోరమా వ్యవస్థను ఏర్పాటు చేశారు.

– నెక్కంటి సీఫుడ్స్, కోరమండల్ పెయింట్స్ సంస్థలు అందించిన దాదాపు రూ.50 లక్షలతో ప్రస్తుతం వేదిక ఎదురుగా 600 మంది వరకు ప్రేక్షకులు కూర్చొని కార్యక్రమాలను వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందు కోసం గతంలో ఉన్న విధంగా సిమెంట్ బెంచీలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఫ్లోరింగ్ పనులు పూర్తి చేసుకుని సీటింగ్ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. వేదికపై కళాకారులకు ఉపయుక్తంగా ఒక టాయిలెట్ బ్లాక్‌ని, వేదికకు పక్కనే ప్రేక్షకుల కోసం ప్రత్యేకంగా ఒక టాయిలెట్ బ్లాక్, ఎలివేషన్, గ్రిల్స్ ఏర్పాట్లు, వర్షం కురిసిన సమయంలో నీరు బయటకు వెళ్లడానికి ప్రత్యేకంగా డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులో ఉంచుతున్నారు.

కళలకూ ప్రోత్సాహం ..నూతన విద్యా విధానంలో చెప్పిన విధంగా విద్యార్థులను విద్యతో పాటు కళలు, క్రీడల్లో కూడా ప్రోత్సహించేలా ఏయూ అధికారులు కృషి చేస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనకు ఉపయుక్తంగా ఆరుబయలు రంగస్థలాన్ని పూర్తి స్థాయిలో ఆధునీకరించి అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ నెల 26న జరగనున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం 98వ వ్యవస్థాపక దినోత్సవం రోజున ఈ థియేటర్‌ను పునః ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఏయూ రంగస్థల, సంగీత, నృత్య విభాగాల విద్యార్థుల ప్రదర్శనలతో పాటు నగరంలో సాంస్కృతిక కార్యక్రమాల వేదికగా దీనిని వినియోగించనున్నట్టు అధికారులు తెలిపారు.



రెయిలింగ్ పనులు చేస్తున్న కార్మికుడు



సిద్ధం చేసిన సిమెంట్ బెంచీలు

విస్తృతంగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అక్కరమాని విజయనిర్మల తదితరులు

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించనున్నట్టు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల తెలిపారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు, ముఖ్యనాయకుల సమక్షంలో బుధవారం ఎంవీపీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఈ మేరకు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగనన్న పేరుతో ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు 14 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమాలు ఏ రోజు ఏయే వార్డుల్లో జరుగుతాయో త్వరలో ప్రణాళిక విడుదల చేస్తామన్నారు. పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు వార్డుల వారీగా ఆయా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రజల నమ్మకాన్ని పొందుతూ ముఖ్యమంత్రి చేపట్టిన కార్యక్రమాలతో పాటు భవిష్యత్ ప్రగతికి బాటలు వేస్తూ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామన్నారు.

క్లుప్తంగా

పారా లీగల్ వలంటీర్‌గా సత్యకుమార్



నియామక పత్రాన్ని అందుకుంటున్న సత్యకుమార్

ఆరిలోవ: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పరిధిలో విధులు నిర్వర్తించేందుకు ఆధ్యాత్మికవేత్త పి.సత్యకుమార్ పారా లీగల్ వలంటీర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కేవీవీ బులి కృష్ణ బుధవారం ఆయనకు ఉత్తర్వులు అందజేశారు. న్యాయ సేవాధికార సంస్థ విధుల్లో భాగంగా ఎంవీపీ కాలనీ రైతు బజార్‌లో రైతులకు శని, ఆదివారాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు న్యాయవాది యు.ఆర్.నరసింగరావుతో కలిసి సత్యకుమార్ ఉచిత న్యాయ సహాయం అందించనున్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఎంవీపీ కాలనీ: వైదిక విజ్ఞాన విపంచి సంస్థ ఆధ్వర్యంలో శ్రీసీతారాముల కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. వైఎస్సార్ జిల్లాలోని ఒంటిమెట్టలో శ్రీకోదండరామస్వామి కల్యాణాన్ని పురస్కరించుకుని ఏటా వైదిక విజ్ఞాన విపంచి సంస్థ సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తుంది. దీనిలో భాగంగానే బుధవారం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా కల్యాణోత్సవం నిర్వహించారు. గురువారం పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు హరిభానుప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, నగర భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రపంచ సాహితీ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



స్వరాజ్యం వెంకట రమణమ్మ

సీతంపేట: ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు నగరానికి చెందిన కొల్లూరు స్వరాజ్యం వెంకట రమణమ్మకు ఆహ్వానం అందింది. శ్రీశ్రీ కళావేదిక ఈ నెల 9, 10 తేదీల్లో తిరుపతిలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని బాలబాట పిల్లల మాస పత్రిక సంపాదకురాలు రమణమ్మను ఆహ్వానించారు. ఈమేరకు శ్రీశ్రీ కళావేదిక నుంచి ఆహ్వానం అందినట్టు బుధవారం ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాల్గొని కవితాగానం చేయనున్నట్టు చెప్పారు. తను రచించిన్న'స్వరాజ్య స్వరాలు' లలిత సంగీత గీతాల పుస్తకాన్ని ఆ వేదికపై అతిథుల చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్టు పేర్కొన్నారు.

'మార్గనిర్దేశకులు కవులు'

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో కవి సమ్మేళనం జరిగింది. సాహితీవేత్త వి.ఆర్.ఎస్.సోమయాజులు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కవులు సమాజ మార్గనిర్దేశకులు, క్రాంతదర్శులు, మానవతా మూర్తులని అభివర్ణించారు. కవుల కీర్తి వారి కావ్యాల ద్వారా తరతరాలకు నిలిచిపోతుందన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సహృదయ సాహితి కవులకు పుట్టినిల్లని, నాలుగు దశాబ్దాలుగా ఎందరో కవులు, రచయితలు తమ సంస్థ ద్వారా పరిచయమయ్యారని తెలిపారు. రచయిత కె.జి.వేణు సాహితీవేత్త కడియాల రామమోహనరావు గురించి పరిచయం చేస్తూ ప్రసంగించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, కవులు సిహెచ్.సినసూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, సోమయాజులు, నాగుల శ్రీనివాసరావు, రామతాత, కొత్తూరు రమణ, చిన సూర్యనారాయణ పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



ఏయూలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రెక్టార్ సమత, తదితరులు



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఏయూ క్యాంపస్: దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బుధవారం ఏయూలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం రెక్టార్ మాట్లాడుతూ ఆత్మాభిమానంతో ప్రజలు జీవించాలని జగ్జీవన్‌రామ్ కోరుకునే వారన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దేశం కోసం ఎనలేని సేవలు అందించారన్నారు. ఈ సందర్భంగా ఆచార్య టి.వి.కృష్ణ రచించిన ×సోషియో పొలిటికల్ ఐడియాలజీ అండ్ లీడర్‌షిప్ ఆఫ్ బాబు జగ్జీవన్ రామ్× పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్‌లో స్థానం సాధించిన ఏయూ ఉద్యోగి చెన్నా అప్పలరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ టి.షారోన్ రాజు, ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎ.నరసింహారావు, కె.శ్రీనివాసరావు, వి.విజయలక్ష్మి, టి.శోభశ్రీ, ఆచార్య జి.శశిభూషణరావు, కె.విశ్వేశ్వరరావు, ఎ.కె.ఎం.పవార్, పి.అర్జున్, కె.వెంకటేశ్వర్లు, ఎన్.ఎ.డి.పాల్, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: బీచ్ రోడ్డులోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడూరు సంజీవరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కేతినేని సురేంద్రమోహన్, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కేఎస్‌పీ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యనగర్ కొండపై కొత్త పైపులైన్



అంబేడ్కర్‌నగర్ వద్ద నీటి సరఫరా కొత్త లైన్ కోసం చేపడుతున్న పనులు

ఆరిలోవ: స్థానిక సుందరయ్యనగర్ కొండపైకి జీవీఎంసీ నీటి సరఫరా పైపులైన్ ద్వారా నీరు వెళ్లడం లేదు. దీనిపై స్థానికులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కోసం అధికారులు కొత్తగా పైపులైన్‌కు కనెక్షన్ అమర్చే పనులు చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం అంబేడ్కర్ కూడలి సమీపంలో ప్రధాన రహదారి కింద ఉన్న పైపులైన్ పనులు నిర్వహించారు. సుందర్‌నగర్ కొండపైకి నీరు సక్రమంగా సరఫరా జరిగేలా పైపులు అమర్చారు. అయితే ఇది ప్రధాన రహదారి కావడంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తింది. నగరం నుంచి వచ్చే సిటీ బస్సులు, ఆటోలు, కార్లకు ఈ మార్గంలో బ్రేక్ పడింది. సిటీ బస్సులు తోటగరువు, బాలాజీనగర్, అంబేడ్కర్ కూడలి మీదుగా శ్రీకాంత్‌నగర్ వైపు తిరిగి ఆరిలోవ కాలనీ ఆఖరి బస్‌స్టాప్‌కు రాకపోకలు సాగించాయి. ఉదయం నుంచి రోజంతా ఈ పనులు జరిగాయి. ఈ పనులను నీటి సరఫరా ఏఈ అప్పాజీ పర్యవేక్షణలో చేపట్టారు. ఈ పనులు అర్ధరాత్రి వరకు జరగనున్నట్లు ఆయన తెలిపారు.

ఆలివ్‌రిడ్లే సంతతిని కాపాడుకోవాలి



ఆలీవ్ రిడ్లే తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెడుతున్న జేసీ కల్పనా కుమారి

పరవాడ: ఆలీవ్‌రిడ్లేతాబేళ్ల సంతతిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పిలుపునిచ్చారు. సింహాద్రి ఎన్టీపీసీ ఆర్థిక సహకారంతో ముత్యాలమ్మపాలెం తీరం హేచరీలో అభివృద్ధి చేసిన 500 ఆలీవ్‌రిడ్లే తాబేళ్లను జేసీ బుధవారం సముద్ర జలాల్లోకి వదిలారు. ఈ తాబేలు పిల్లల పెంపకానికి నిధులు కేటాయిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యాన్ని జేసీ అభినందించారు. తీరంలో తాబేళ్లు పెట్టిన గుడ్లను సేకరించి అక్కడే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హేచరీలో పిల్లలను పొదిగించి అనంతరం సముద్ర జలాల్లో విడిచిపెట్టడానికి అవసమైన వ్యయాన్ని ఎన్టీపీసీ భరిస్తుందని ఫారెస్టు సెక్షన్ అధికారి ఎ.వి.ఎస్.కె.వర్మ చెప్పారు. అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది ఈ.శివ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో ప్రతిభ



మధురవాడ క్రీడాకారులతో కోచ్‌లు

మధురవాడ: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో మధురవాడకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. గత నెల 28 నుంచి 31 వరకు రాజస్థాన్‌లో యూనివర్శిటీ ఆఫ్ కోటా వేదికగా నిర్వహించిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు 8 పతకాలురాగా అందులో ముగ్గురు మధురవాడ క్రీడాకారులు కావడం విశేషం. క్యాడెట్ బాలికల విభాగంలో కె.ధనలక్ష్మి స్వర్ణం, సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో విశాల్, మహేశ్వరరావు కాంస్య పతకాలు సాధించినట్టు ఆంధ్రప్రదేశ్ తైక్వాండో సంఘం ప్రధాన కార్యదర్శి అచ్యుత రెడ్డి తెలిపారు. మధురవాడలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను కోచ్ ఎమ్.సురేష్, ఏపీ కోచ్‌గా వ్యవహరించిన కె.సుకుమార్ సంపత్, కొర్రాయి సురేష్ తదితరులు అభినందించారు.

కార్మిక చట్టాలు అమలుకు డిమాండ్

ఆరిలోవ: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాలు సక్రమంగా అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ విశాఖ మహేశ్వరి బిల్డింగ్ మేస్త్రీ అండ్ కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రవీంద్రనగర్‌లో బుధవారం కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా పరంజీ కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు సాయిబాబా, సభ్యులు పాల్గొన్నారు.

చీటీల నిర్వాహకుడు అదృశ్యంపై కేసు



రామరెడ్డి

ఎంవీపీ కాలనీ: నక్కవానిపాలేనికి చెందిన దుంగి రామరెడ్డి(48) అనే చీటీల నిర్వాహకుడు అదృశ్యంపై ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుటుంబ సభ్యులతో కలిసి నక్కవానిపాలెంలో నివాసం ఉంటున్న రామరెడ్డి స్థానికంగా పప్పుల చీటీలు వేస్తుంటాడు. కొంతకాలంగా చీటీ డబ్బులు చెల్లించకపోవడంతో సభ్యులు ఒత్తిడి చేస్తున్నారు. ఈ చీటీ డబ్బులను పలువురికి వడ్డీకి ఇచ్చానని, అవి తిరిగిరాక చెల్లింపుల్లో జాప్యమైనట్టు రామరెడ్డి చెబుతూ వచ్చాడు. గత కొద్ది రోజులుగా ఒత్తిడి ఎక్కువ కావడంతో ఇటీవల రామరెడ్డి పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించగా.. కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తరలించి రక్షించారు. ఈ క్రమంలో రామరెడ్డి మంగళవారం రాత్రి నుంచి కనిపించకుండా పోయాడు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. అతని భార్య జయ ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును హెడ్ కానిస్టేబుల్ రుద్రారెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

ఉక్కు పరిశ్రమల్లో కండీషన్ మానిటరింగ్

కొమ్మాది: ఉక్కు పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించడం, యంత్రాల పనితీరును సమీక్షించడం ద్వారా ఉత్పాదనకు అంతరాయం కలగకుండా చూడటంలో కండీషన్ మానిటరింగ్ కీలక పాత్ర పోషిస్తోందని టాటా స్టీల్ పరిశ్రమ ఉపాధ్యక్షుడు ప్రబల్ ఘోష్ అన్నారు. కండీషన్ మానిటరింగ్ సొసైటీ ఆఫ్ ఇండియా గీతం వర్సిటీలో బుధవారం నిర్వహించిన వి.భుజంగరావు ధార్మికోపన్యాసం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. యంత్రాల దీర్ఘకాలిక పనితీరును మెరుగుపరచడానికి కండీషన్ మానిటరింగ్ అవసరమన్నారు. కార్యక్రమంలో డీన్స్ ప్రొఫెసర్ విజయశేఖర్, ప్రొఫెసర్ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ దారుణం'



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలోనే ఎంతో పేరుపొందిన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం చేయాలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 783వ రోజు బుధవారం సింటర్ ప్లాంట్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఏళ్లు గడుస్తున్నా ఉక్కు ఉద్యమాన్ని నిరాటంకంగా కొనసాగించడం కార్మికుల పోరాట పటిమకు నిదర్శనమన్నారు. కార్మికులు, నిర్వాసితుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. ప్రధాన పార్టీల నాయకులతో త్వరలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. కార్మికులందరూ ఐక్యంగా ఉక్కు పోరాటంలో పాల్గొని, పరిశ్రమను కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'ఆసరా'తో మహిళా సంక్షేమం

- మేయర్ గొలగాని, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని
- జోడుగుళలుపాలెంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు



సీఎం జగన్ పోస్టర్‌కు క్షీరాభిషేకం చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, అక్కరమాని

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంక్షేమం కోసం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల తెలిపారు. జీవీఎంసీ జోన్–2 పరిధిలో జోడుగుళ్లపాలెంలో బుధవారం ఆసరా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ పోస్టర్‌కు లబ్ధిదారులతో కలిసి వారు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళలు ముఖ్యమంత్రి పోస్టర్లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా మేయర్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు మహిళలను పసుపు కుంకుమ పేరుతో మోసం చేశారని విమర్శించారు. జగనన్న ప్రభుతం మాత్రం మహిళలకు అండగా నిలుస్తోందన్నారు. మహిళలకు చేయూతను అందిస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జోన్–2 కమిషనర్ కనక మహాలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై అప్పన్న తిరువీధి



సూర్యప్రభ వావానంపై అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదవరోజు బుధవారం స్వామివారికి సూర్యప్రభ వాహనంపై తిరువీధి విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవిలను విశేషంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై అధిష్టింపజేశారు. సాయంత్రం సింహగిరి మాడ వీధిల్లో ఘనంగా తిరువీధి నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు గిరి తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు తదితరులు స్వామిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి మృగయోత్సవం (దొంగలదోపు) నిర్వహించనున్నారు.

మోదీ విధానాలపై ఐక్యపోరు కొనసాగిస్తాం



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : మోదీ విధానాలపై ఐక్యపోరు కొనసాగిస్తామని, ఆయన ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ హెచ్చరించారు. కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతుందని.. దానిని నిరసిస్తున్నట్లు తెలియజేస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఢిల్లీలో జరుగుతున్న ర్యాలీకి పది లక్షలకు పైగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు చేరుకున్నారని అన్నారు. ధర్నాకు ముందు మోదీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతున్న తీరును తెలియజేస్తూ కళారూపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు యూనియన్ల నాయకులు ప్రసాద్, ఆర్.లక్ష్మణమూర్తి, యు.రాజు, శ్రీదేవి, సరస్వతి, దేవి, చినతల్లి, తోటమ్మ, రాము, వెంకటలక్ష్మి, డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: నేడు బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవాలయంలో సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఈ పూజ నిర్వహిస్తారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.